


## (క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

### జరిగిన కథ

**జరిగిన కథ: మహతి, వంశీ చిననాటి స్నేహితులు. ఒకే ఊళ్ళో ఉంటారు. వంశీ, సీమల సంసారంలో వింత సంక్షోభం రగులుతూ ఉంటుంది. ఈలోగా మహతికి రూమ్మేట్ గా మహతీ, వంశీల చిన్నప్పటి మరో స్నేహితురాలు గౌతమి వస్తుంది. ముగ్గురూ కలిసి వంశీ వాళ్ళ అమ్మమ్మగారి ఊరు రావిపాడులో జాతర చూసి వస్తారు. సీమతో ఇంక సరిపడదని వంశీ నిర్ణయించుకుంటాడు. మహతి ఆనంద్ తో లివిన్ రిలేషన్ షిప్ కి సిద్ధమవుతుంది. గౌతమి వంశీని ఆకర్షిస్తుంది.**

## 13

మహతి చెప్పిన న్యూస్ అర్థం కావడానికి వంశీకి కాసేపు పట్టింది. విషయం చెప్పి చాలా మామూలుగా రేపు సాయంత్రం పాండీ కేఫ్ లో కలుద్దామని చెప్పిందంతే. 'గౌతమి కూడా వస్తుందా?' అని అడగబోయి తమాయించుకున్నాడు. వస్తుందని తెలుసు.

"లివిన్ అంటే షాక్ అయ్యాను." పాండీ కేఫ్ బయట నిలబడ్డ వంశీతో వస్తూనే చెప్పింది గౌతమి.

సన్నగా నవ్వి చెప్పాడు. "లోపలికెళ్ళి మాట్లాడుకుందాం పద"

నలుగురికి కేటాయించిన ఓ బూత్ లో కూర్చున్నారు. వెయిటర్ రాగానే వాటర్ బాటిల్ తెమ్మని, ఆర్డర్ కి కాస్త టైం పడుతుందని చెప్పేసింది గౌతమి.

"నీకెప్పుడు తెలిసింది?" కుతూహలంగా అడిగింది.

గౌతమిలో ఇంత ఆసక్తి చూసి కాస్త ఆశ్చర్యమనిపించింది వంశీకి.

"'నిన్న రాత్రి. ఇదీ విషయం. రేపు సాయంత్రం పాండీకి రా..' అని చెప్పి పెట్టేసింది."

"నాకు నిన్న మధ్యాహ్నం! 'ఇల్లు వెతుక్కుంటున్నాను గౌతమీ.. ఆనంద్ తో మూవిన్ అవడానికి. నీకు రూమ్మేట్ ఎవరైనా దొరుకుతారేమో చూడనా?' అని ఎంత సింపుల్ గా చెప్పేసిందో!!" కళ్ళింతలు చేసుకు చెప్తోంది గౌతమి.

"గుడ్ ఫర్ హర్! నెమ్మదిగా మనుషుల్లో పడినట్టే! ఏ పురుషద్వేష సమాజమో స్థాపించేస్తుందనుకున్నాను."

వస్తున్న మహతిని వేలితో చూపించాడు గౌతమికి. ఇద్దరికీ దూరం నుండే హాయ్ చెప్తూ వచ్చి కూర్చుంది.

"ఎలా ఉన్నారు మేడమ్? ఒక్కర్తివే వచ్చావేం?" నవ్వుతూ అడిగాడు.

"ఓ.. సూపర్! ఒక్కర్తినే కాక!?"

"అతన్ని పరిచయం చెయ్యడానికే ఈ మీటింగేమో అనుకున్నా.."

"ముందు విషయం కాస్త సింక్ ఇన్ అవనీ! చేద్దాం చేద్దాం." నవ్వింది మహతి.

"సో.. ?"

"సో.. అదీ విషయం. ఇల్లు వెతుక్కోగానే మూవిన్ అవుతాం."

"కంగ్రాట్స్ డియర్! వెరీ హేపీ ఫర్ యూ!!" మహతి భుజం మీద చేయి వేసి చెప్పింది గౌతమి.

"మీ టూ.." చెప్పాడు వంశీ.

"ఇక గౌతమి ఒక్కర్తే ఉండాలి. రూమ్మేట్ దొరికే దాకా.." వంశీ వైపు చూస్తూ చెప్పింది మహతి.

"ఎందుకూ తను మాత్రం ఒంటరిగా ఎన్నాళ్ళు? ఏం మేడమ్ నెక్స్ట్ మీరూ చెప్తారా గుడ్ న్యూస్?" వంశీ గౌతమి ముఖ కవళికలని జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

క్షణకాలం చాలా అసహనంగా మారిందామె మొహం. ఇంతలోనే నిభాయించుకుని.. మౌనంగా ఉండిపోయింది.

"చెప్పు.. ఆనంద్ ఏమంటున్నాడు? అసలెలా ప్రపోజ్ చేసావు?" టాపిక్ మార్చాడు.

"వాట్! నేను ప్రపోజ్ చెయ్యడమేంటీ? ఎలా కనిపిస్తున్నానూ..." గలగలా కబుర్లు మొదలుపెట్టేసింది మహతి.

వింటున్నా, గౌతమి ముఖంలో మెరిసి మాయమైన ఇబ్బంది ఏమిటనే ఆలోచన వంశీ బుర్రలో తిరుగుతూనే ఉంది.

***

"సో.. వాట్స్ న్యూ? నీ కబుర్లేం చెప్పనే లేదు. నేనే వాగాను." అంది మహతి.

మహతి ఇంటి గేట్ దగ్గర నిలబడ్డారిద్దరూ.. గౌతమి పనుందని లోపలికెళ్ళిపోయింది.

"ఏముంటాయ్? రొటీన్.. విసుగ్గా చిరాగ్గా గడిచిపోతోంది జీవితం."

"ఊ.. సీమ..." ఏదో అడగబోయింది.

"మహతీ. కొత్తగా ఏం ఉండవు. అదే అలా సాగుతుంది. నేను లొంగను. తను తగ్గదు." అభావంగా ఉంది వంశీ గొంతు.

"పోనీ పిల్లలు పుడితే మారుతుందేమో.. ఆలోచించావా?"

మహతి మాట పూర్తవక ముందే "నువ్వు కూడానా!" బాధగా అన్నాడు.

"ఏం వంశీ...?"

" ఈ ప్రపంచానికి బెటర్ ఆఫ్ స్ప్రింగ్ ని ఇవ్వాలని ప్రతి ప్రాణీ తపన పడుతుంది. ఈ మాటన్నది నువ్వే కదా మహతీ. ఏమో.. నాకు మా ఇద్దరి కాంబినేషన్ మీద, పెంపకం మీదా కూడా నమ్మకం లేదు."

"అలా కాదులే.." సర్దిచెప్పబోయింది.

"ఏది కాదు! రజనీ ఆంటీ సెలక్షన్ ని మెచ్చుకున్నావు. ముందుతరాలకి రోగాలని ఇవ్వడం ఎంత తప్పో నీకు తెలుసు. మరి మానసిక జాడ్యాల గురించి మర్చిపోతారేం. జీవితాన్ని నెగిటివిటీతో నింపుకున్న ఆమె. ఆమెకి నచ్చని నేను. మా ఇద్దరికీ పిల్లలా! అసలేమీ పొసగని ఇద్దరు ఎలా మంచి పిల్లలని కనగలరు! మీ సైన్సేమీ చెప్పదా?"

"వద్దులే ఈ టాపిక్. ఇంకేమైనా మాట్లాడు." మహతి నొచ్చుకుంది.

"నేను సీమ విషయంలో పూర్తిగా విసిగిపోయాను మహతీ. అలా అని నా జీవితాన్ని నిస్సారంగా గడపలేను."

"మరేం చేస్తావ్? గౌతమికి ప్రపోజ్ చేస్తావా?!"

మహతి కళ్ళలోకి సూటిగా ఒక్క సారి చూసి, గిర్రున వెనక్కి తిరిగి కార్ వైపు నడుచుకెళ్ళిపోయాడు. కార్ వెళ్ళేదాకా చూస్తూ ఉండిపోయింది.

***

"ఏం తెలుసు స్టార్స్ గురించి..?" అల్లరిగా నవ్వుతూ అడిగింది మహతి.

"వీనస్ గురించి మాత్రం తెలుసు." చెప్పాడు ఆనంద్.

"హయ్యో రామా! వీనస్ స్టార్ కాదు! ప్లానెట్.."

"ఊప్స్.. కదా! పోనీ ఇవాళ రాత్రి స్టార్స్ చూద్దామా? నువ్వే చెప్పొచ్చు.. ఏది స్టారో ఏది ప్లానెటో.."

"అక్కర్లేదు. మనింటికెళ్ళిపోయాక రోజూ చూద్దాం. అప్పుడు నువ్వే అంటావు. అనవసరంగా అడిగాన్రా బాబూ అని.."

"ఏమో! తినబోతూ రుచులెందుకు?" ఆనంద్ పెదాల మీద నవ్వు చెదరలేదు.

"హేయ్.. నీకు భయంగా లేదా?" ఉన్నట్టుండి అడిగింది.

"నీకు ఉందా?"

"భయం కాదు కానీ.. కొద్దిగా టెన్షన్. అంత దగ్గరగా గడపడం మొదలుపెడితే నీకు నచ్చనేమో అని."

మహతి చేతిని పెదాలకానించుకుని చెప్పాడు.

"అలా అనిపించిందంటే చాలు మహతీ.. మిగిలినది నేను చూసుకుంటాను."

"అర్థం కాలేదు.." రెప్పవేయకుండా చూస్తోంది.

"యూ ఆర్ ఇన్ లవ్. దాన్ని పెంచి పోషించడం నా బాధ్యత."

"ఓహో.. మరి నా బాధ్యతలేమిటో!" నవ్వుతూ అడిగింది.

"బెండకాయ కూర వండకపోవడం."

"హ్హుహ్హూ.... ఆనంద్..." అతని చేతిలోంచి చెయ్యి లాగేసుకుని భుజం మీద కొట్టింది.

"స్టార్స్ ఆకాశంలోనే కాదు. ఇండోర్ కూడా కనిపిస్తాయని నమ్మడం."

"ప్లానెటోరియంలోనా?"

నవ్వాపుకుంటూ తలకొట్టుకుంటున్న ఆనంద్ ని అయోమయంగా చూసింది మహతి.

***

"ఎలా ఉంది లైఫ్?" ఆసక్తిగా అడిగింది గౌతమి.

"ఏదీ ఇంకా వారమే కదా అయిందీ.."

"వారంలో ఎలా ఉందో చెప్పు పోనీ.."

"చెప్తే ఏడిపిస్తావు."

"చెప్పకపోయినా తప్పదు కానీ.. ఊ.. "నవ్వింది గౌతమి.

"బావుంది గౌతమీ.. లైఫ్ లో ఇంత లోటుండేదా అని ఆశ్చర్యపోతున్నాను. అంత బావుంది."

క్షణమాగి ఆకాశంలోకి పరిశీలనగా చూసింది. చుక్కలు మిణుకుమిణుకుమంటున్నాయి. చిన్ననాటి స్నేహితులని గ్రూప్ ఫోటోలో చూసినట్టనిపించింది మహతికి. పెద్దగా మిస్ అవడం లేదు. అలా అని మరచిపోనూలేదు.

"మొన్నీరోజు తెల్లవారు ఝామున వేగుచుక్క చూపించాను."

"ఆహా! పాపం నిద్రపాడుచేసి మరీనా.."

"ఆ.. లేకపోతే వీనస్ స్టారో ప్లానెటో కూడా తెలీదు."

"పోన్లెద్దూ.. ఇంతకీ స్టారా, ప్లానెట్టా?" నాలిక కరుచుకుంటూ అడిగింది గౌతమి.

గౌతమి చెవి మెలేసి నవ్వింది మహతి.

"వీనస్ అంటే శుక్రుడు పిల్లా.. వేగుచుక్క. అవడానికి ప్లానెట్. లవ్ కి, రొమాన్స్ కీ అధిదేవత."

"ఊ ఊ"

"చిత్రమేంటో తెలుసా గౌతమీ.. ఇన్ని తేడాలుంటాయా మనుషుల్లో.. ఈ జాతీ, ఆ ప్రాంతం బ్లా బ్లా.. చుక్కలు ఆ హద్దులన్నీ చెరిపేస్తాయి. ప్రేమ, మనిషీ ప్రపంచంలో ఏ మూలైనా ఒకటే అనిపిస్తుంది. ఈ వీనస్ ని చూడు. రోమన్ గాడెస్ ఆఫ్ లవ్. క్యుపిడ్ కి తల్లి అని చెప్తారు. ఇదే ఇండియన్ కాంటెక్స్ట్ లో శుక్రుడు ఆస్ట్రాలజీలో ఏడో ఇంటికి అధిపతి. ఇతని దృష్టి సరిగా ఉంటేనే పెళ్ళి సరిగా ఉంటుందంటారు."

"ఓహ్.. చిత్రం కదూ!"

"లవ్ లైఫ్ కి వీనస్ కి బోలెడు కనెక్షన్ ఉందన్నమాట. అందుకే చూపించాను ఆనంద్ కి.. " నవ్వింది.

నవ్వుతూ మౌనంగా ఉండిపోయింది గౌతమి.

"తోడు కావాలి గౌతమీ.. ఎంత జీవితం చెప్పు! ఇట్టే గడిచిపోతుంది. చలిగా, ఒంటరిగా ఇదే డాబా మీద ఎన్ని రాత్రులు గడిచాయో బాగా గుర్తు. ఆ కొత్త బాల్కనీలో నిలబడి ఆనంద్ తో కలిసి వీనస్ ని చూస్తూంటే చాలాసేపు వింతగా అనిపించింది."

"తేడా ఉంది కదూ!" అడిగింది గౌతమి.

"చాలా...." ఆకాశంలోకి చూస్తూ చెప్పింది మహతి.

***

"నవ్వు నటించకు వంశీ." కోపంగా చెప్పింది మహతి.

"ఎందుకలా అనిపిస్తోంది నీకు?" అదే నవ్వుమొహంతో అడిగాడు.

"వర్క్ హోలిక్ వి అయిపోతున్నావ్"

"సత్కవుల్ హాలికులైననేమి.. అన్నారు. కవిగారినైపోతానైతే.."

"యే హార్టెటాకో వస్తుంది. పిచ్చివాగుడు వాగకు."

"ఏమయింది మహీ..." అడిగాడు నవ్వాపుతూ.

"ఎవరి నుంచి దాక్కుంటున్నావు. ఓ కాల్ లేదు. ఏం లేదు.. " అరిచింది.

"నువ్వూ బిజీగా ఉన్నావు కదా!"

"అదేం కాదు. నేను నిలదీశాననే కదా మాట్లాడడం మానేశావు. ఇంకేమీ అడగన్లే.." నొచ్చుకుంటూ నిష్ఠూరమాడింది.

"అబ్బా... కాదు మహతీ. ఇదిగో చూడు.. సీమ విషయంలో నేను మార్చగలిగేది ఏదీ లేదు. అది నువ్వు అర్థం చేసుకోగలిగితే చాలు. ఈ విషయమంతా తెలిసిన ఒకేఒక మనిషివి నువ్వు. నీకు అప్డేట్ చెయ్యడం నా బాధ్యత కదా!"

"అవును వంశీ.. అర్థమైంది. ఇక ఇంతేనా? ఇలా గడిచిపోవలసిందేనా?"

"తెలీదు మహీ.. నిజంగా తెలీదు." వంశీ మొహం తేటగా ఉంది.

ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది. తననే చూస్తున్న వంశీ వైపు సూటిగా చూస్తూ అడిగింది.

"మరి గౌతమి?"

"ఉహూ.. అదీ తెలీదు."

"తెలుసుకోవాలనిపించట్లేదా? తన మనసు.. నీ ఇష్టం.. ఇవేవీ తెలుసుకోవా?"

"తెలుసుకుని?" వంశీ ప్రశ్నలో బాధ వినిపించింది మహతికి..

"మహతీ.. ఇన్ని మిరాకిల్స్ జరుగుతున్నాయ్ ప్రపంచంలో.. టైం మెషీన్ ఒక్కటి కనుక్కోకూడదూ మీ సైంటిస్ట్ లు? చేసిన తప్పులనీ, జరిగిన పొరపాట్లనీ చెరిపేయాలని గింజుకునే నరకం తప్పుతుంది." వంశీ మాటలు కలలో తేలుతున్నట్టు వస్తున్నాయి.

ఇక ఆగలేకపోయింది మహతి.. చెప్పేసింది.

"గౌతమి వెళ్ళిపోతోంది వంశీ..."

***

## ఇంకావుంది.

(రచయిత్రి బ్లాగు http://kothavakaya.blogspot.com/)